


'బియ్యం అయిపోవచ్చినాయి. ఈ పొద్దే మొస్తాయో, ఏమో. బియ్యం తేవాల' - సుభద్ర హెచ్చరించింది.

భార్య సుభద్ర, ఇంట్లో బియ్యం సమస్యను లేవనెత్తిన శుభ తరుణంలో వెంకటరత్నం ఒక భావి భారత పౌరుని ఆంధ్రభాషా పాండిత్యాన్ని, జవాబు పత్రం లోని ఆహార సమస్యనుబట్టి బేరీజు వేస్తున్నాడు. విద్యార్థులు పరీక్షల్లో రాసిన కాగితాల మీద ఆహార సమస్యను సులభంగా పరిష్కరించవచ్చు, కానీ, నెలలో మూడవ వారమయినా తిరక్కముందే ఇంట్లో పరిష్క

# చెదరిన గుండెలు

ళించడం వెంకటరత్నంలాంటి వాడికి అంత సులభం కాదు. వెంకటరత్నం పేపర్లు దిద్దడం మాని, ఆలోచనలోపడి అస్పష్టంగా గొణిగాడు :

'అప్పుడే అయిపోయినాయా ?'

'అంటే, నేనేమన్నా అమ్ముకున్నానా ? వాకేమన్నా దయ్యం పట్టి ఇంట్లో పోసిన బియ్యం రాసులు తిన్నానా ? లేకుంటే మావాళ్ళేమయినా మీ ఇంటి మీద వడి తిన్నారా? మాటి మాటికి వచ్చే మీ చుట్టాలే తిన్నారు. పోయినేళ్ళల్లో తెచ్చిన బియ్యం మూటను సగంపైగా వాళ్ళే తిన్నారు. ఆ మిగిల్నేటివేగా మనం తినింది. మన మొగానికి రెండుపూట్లా ఆ బియ్యం తప్ప తినడానికి ఏమన్నా వుంటే కథా అయిపోంది? అయిపోక ఏం జేస్తాయి?' —

సుభద్ర ఆగ్రహించింది ముఖ్యంగా ఇటువంటి సందర్భాల్లో తనలాంటి నడిమి తరగతి వాడెవడూ సుభద్రలాంటి భార్యల్ని కదిలించ కూడదనుకొన్నాడు వెంకటరత్నం. బురద చేసుకొన్నాక కడుక్కోక తప్పదు. వెంకటరత్నం సరసంగా నవ్వుతూ అన్నాడు:

'అంత మాట లెందుకు? నేనేం నీకు లెక్కా శేషవివ్వడం లేదుగా. ఎవరన్నా తిన్నీ, అప్పుడే, ఇరవై రోజులకే మూట బియ్యం అయిపోయినాయా అన్నా, నాకు మాత్రం మనింట్లో బియ్యం ఖర్చు తెలీదా? రాణీగారికి అప్పుడే అంత కోపం అయితే ఎట్లా ?'

మాటల యుద్ధంనుంచి రేగే బాధను తప్పించుకోవటానికి తరచుగా వెంకటరత్నం ఉపయోగించే సరసత బెడిసికొట్టింది

'సరసాలకు మాత్రం కొదవ లేదు. కట్టుకున్నదాన్ని సుఖపెట్టే రాత లేదు గానీ'—సుభద్ర విసుగ్గా అంది; విసురుగా అంది; బాధగా, కోపంగా, అసహ్యంగా అంది

భర్త సరసాన్ని సరసంగా తీసుకొనే రసజ్ఞతను సుభద్ర కాపురానికి వచ్చిన కొత్తలోనే కోల్పోయింది. ఆమె దెబ్బ కొట్ట వలసినచోట కొట్టి, వంటింట్లోకి దూరింది. వెంకటరత్నం వెంబడించి అనునయిద్దామనుకొన్నాడు కానీ సుభద్ర వడ్డించిన ఒకటి రెండు మాటలతోనే కడుపు నిండిపోయింది. మాటలతో చిత్రవధచేసే శక్తి సుభద్రకుంది. ఎంత చిన్న మాటకైనా గాయపడే హద్దులు మించిన అనుభూతి తీవ్రత వెంకటరత్నానికుంది. అయితే సుభద్ర గయ్యాళి కాదు. భర్తను రాచి రంపాన పెట్టడమే ఆమె జీవిత పరమావధి కాదు. సంసారం నడపడంలో భర్త నిస్సహాయత్వం అనుభవానికి వచ్చినప్పుడల్లా సుభద్రకు జుగుప్స, ట్యూషన్లకూ, మార్కులు వేయడానికి కూడా పనికిరాని వెంకటరత్నం పనికిమాలిన తెలుగు పాండిత్యం మీద పగ. ఏ వికాసమూ లేని మొండి బ్రతుకుపట్ల ద్వేషం. అందుకే సుభద్ర హృదయంలో రేచులు. అందుకే సుభద్ర నాలుకపై త్రాచులు. అందుకే సుభద్ర మాటల్లో కారం రాచిన తూటాలు, కాలం ఇచ్చిన కత్తులు.

వంటింట్లో మండుతున్న పొయిలోనికి కట్టె లెగదోస్తున్న సుభద్ర హృదయం భగ భగ మండుతోంది; పొయిలోని కట్టెల్లా కాలుతోంది. తానేమీ స్వర్గ సౌఖ్యాలు కోరుకో లేదు. తనకేమీ ఇప్పటికి మేడలక్కర్లేదు, మిద్దెలక్కర్లేదు, కార్లక్కర్లేదు. పదిమంది నవుకర్లూ, చాకర్లూ అక్కర్లేదు. తాను కోరుకుందల్లా రెండుపూట్ల కాస్త నోటికి సహించిన భోజనం — రెండు మూడు కూరలతో, నెయ్యితో, పెరుగుతో. రోజుకు రెండే రెండు పూట్ల టిఫిను, వారానికి రెండుమార్లయినా మాంసమో, గుడ్లో, పదో పన్నెండో చీరలు, ఆఫ్‌వాయిలువే కానీ. ఒకటో రెండో నగలు ముచ్చటగా. పెండ్లిలో పుట్టింటివాళ్లు పెట్టిన పది తులాలకూ ఒంటిపుర్రి గొలుసు మిగిలింది. వారానికి ఒక్క సినిమా. పిల్లలకు పాలూ పండ్లూ—రేడియోలో చెప్పినట్లు. ఇంట్లో చాకిరీకి ఒక్క పనిమనిషి, ఒకే ఒక్క పని మనిషి. ఈ గొడ్డు చాకిరీ చెయ్యలేక దుంప తెగుతోంది. కనీసం పక్కింటి పీడబ్ల్యూడీ–సూపర్‌వైజరు భార్య అనుభవించే కొన్నే కొన్ని సుఖాలు. పెళ్లి చేసుకొన్నవాడు సుఖపెట్టలేకపోతే ఇంకెవరు సుఖపెట్టేటట్లు? సుఖపెట్టలేని వాళ్లు తగుదునమ్మా అని పెండ్లెందుకు చేసుకోవాలో? అయినా అందరు మొగుళ్లూ ఇట్లాగే వుంటారా? తన ఖర్మగానీ. తనకు సుఖపడే రాతలేదు. సంపాదనాపరుడైన పేరొక మొగుణ్ని వెంకటరత్నం స్థానంలో ఊహించుకొని, అట్లాంటి ఊహ కలిగినందుకు సుభద్ర నొచ్చుకుంది. ఆయన్నని ఏం లాభం! ఆయన మంచోడే. ఉద్యోగం అట్లాంటిది. నొసటి రాత. కాలం చెడ్డది. సుభద్ర హృదయం వేదనతో బరువెక్కింది.

వెంకటరత్నం గదిలో కుళ్ళుకుంటున్నాడు; నిజమే, భార్యను సుఖపెట్టే రాత తనకు లేదు. సుఖ పెట్టమని అడిగే అధికారమైనా ఆమెకుంది — భార్య కాబట్టి, తను భరించాలి కాబట్టి. తన్ను సుఖ పెట్టమని తానెవ్వర్నడగాలి? సుభద్ర తన్ను కట్టుకొని పొందుతున్నదేమిటి? డబ్బుతో ఇవ్వగలిగిన ఏ సౌఖ్యాలను తాను సుభద్ర కివ్వగలిగాడు? ఇచ్చిన సుఖమల్లా శారీరక సుఖం—డబ్బు ఖర్చులేకుండా ఇవ్వగలిగింది. మరింకేమిచ్చాడు. నలుగురు పిల్లల్ని. ఆపరేషన్ చేయించుకోక పోయుంటే మరో ఇద్దరైనా భూమ్మీదికి వచ్చి వుండేవాళ్లు — తల్లి కడుపు చీలుస్తూ తనకు మరికొన్ని సమస్యలను సృష్టిస్తూ. అయినా సుభద్రను కట్టుకొని తానుమాత్రం అనుభవించిందేమిటి? ఏ ఉద్యోగం చేసేదాన్నో కట్టుకొని వుంటే ఇన్ని బాధ లుండకపోను. వేడ్నీళ్లకు చన్నీళ్లు తోడయ్యేవి. పాత బంధుత్వమూ ఆ సమయానికి త్వరలో కలుగబోయే తియ్యటి సుఖంకోసం పురక లేస్తున్న నెత్తురూ కళ్లకు పొరలు కప్పించి, ఈ వూబిలో దించాయి. కాస్త ఆగివుంటే ఉద్యోగం చేసే ఆడది దొరికివుండేది. ఇప్పుడు మాత్రమేం? సుభద్ర చస్తే చేసుకోవచ్చు. నలుగురు పిల్లల తండ్రి కెవడిస్తాడు? ఏవడో ఒకడు తలమాసిన వాడు. చదువుకొని ఉద్యోగంచేసే ఏ ఆడది తన్ను కట్టుకుంటుంది—అందులో రెండో పెళ్ళయితే ఎవతో ఒకతో తలకుమాసింది. సుభద్రకూ ఇట్లాంటి ఆలోచనలొస్తే! ఛీ ఎంత నీచమైంది మనసు. దరిద్రుడికి నానాకచింత. వెంకటరత్నానికి తనమీద తనకు రోత కలిగింది. ఈ పది పన్నెండేళ్ల జీవితంలో తానుభవించేందేమిటి ఈ బడిపంతులుద్యోగంతో? పేరుకు గ్రేడ్ ఒన్ తెలుగు పండిట్—బహుకార్య సాధక పాఠశాలలో. కాకపోతే సంసార జీవితం ప్రపంచానుభవాన్నిచ్చింది. తనకంటే

హీనమైన వాళ్ళు తనచుట్టూ చాలామంది వున్నారనే జ్ఞానాన్నిచ్చింది. నయం — సుభద్రావాళ్ళను తను మాడ్చడంలేదు — తిండిపెట్టక. తిండంటూ వుంది—విందు భోజనాలు కాకపోయినా. ఇంకా నయం బట్టలంటూ వున్నాయి. చీనిచీనాంబరాలు కాకపోయినా. ఇల్లంటూ వుంది—బాడుగదే ఎలుకల బోనైనా. ఏం తిండో, ఏం బట్టలో, ఏం ఇల్లో! ఆలోచించే కొద్దీ మనసు చెదిరిపోతుంది. ఈ బాధంతా ఇంట్లో బియ్యం అయిపోవడంతో మొదలైంది. వెంకటరత్నం మనసు స్వకరుణతో నిండిపోయింది.

వంటింట్లోంచి మసిబట్టిన చేతుల్తో, పొగతో ఎర్రనైన కళ్ళతో, కార్డు ఒకటి తెచ్చిస్తూ సుభద్ర అంది:

'నిన్న ఈ జాబొచ్చింది. ఇవ్వడం మర్చిపోయా. ఈ గొలుసు రాత నాకర్థం కాలా. అయినా ఏముంటుందీ? మళ్ళా ఎవరో ఒకరు దిగుతారు. పెద్దాసుపత్రిలో చూపించుకోడానికో, కోర్టులో ఏకేసుకో వస్తున్నట్లు రాశుంటారు.'

వెంకటరత్నం మౌనంగా ఉత్తరం అందుకొని చదివాడు. సుభద్ర చెప్పింది నిజమే. పెదనాయనకు బాగులేదట. పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టరుకు చూపించుకోడానికి వస్తున్నాడట వెంకటరత్నం గుండెల్లో పెద్ద బాయి పడింది. ఆయన కూడా బియ్యం తింటాడు. ఆయన వెంట వచ్చే పెద్దమ్మో ఎవరో ఒకరు కూడా బియ్యం తింటారు. పైగా సేవలు. ఈ సంగతిని, ఈ సందర్భంలో సుభద్రకు చెపితే ములుకుల్లాంటి మాటలు వినవలసి వుంటుంది. అంపశయ్యే మేలు.

సుభద్ర అడిగింది :

'ఎవ్రాశినారు ?'

'ఎవరో స్నేహితుడు'—అబద్ధాన్ని కూడా అలవోకగా చెప్పలేని వెంకటరత్నం నంగిగా సమాధానం చెప్పాడు. వుత్తరంలోని గొలుసక్షరాల్ని కూడబలుక్కొని చదివుంటుందేమోనని వెంకటరత్నం భయం.

'ఈ ఇల్లొక సత్రమైంది' సుభద్ర వింతో బాధగా అంది.

'ఉండు బజారుకుపోయి బియ్యం అడిగి వస్తా' వెంకటరత్నం మాట మార్చాడు.

సుభద్ర మెత్తబడింది: 'బియ్యంతో



పాటూ కొన్ని సరుకులు కావాల. తిలకం కూడా అయిపోయింది.'

'ముందు బియ్యం అడిగివస్తా. సరుకులు రేపు తెస్తాలే. తిలకం వచ్చేప్పుడు తెస్తా'—సుభద్ర మరేం లిస్టు సమర్పిస్తుందో, మరేం చర్చిస్తుందోనని భయపడి వెంకటరత్నం బయటికి నడిచాడు. ఇంటికన్నా వీధి మేలు.

వెంకటరత్నం మనసంతా ముళ్ళపొదలా వుంది. ముళ్ళ కంపలా వుంది. ఇంట్లో భార్యాపిల్లలూ, వీధిలో అధికారులూ, అప్పిచ్చినవాళ్ళ బాధలూ చాలక ఈ బంధువుల హింస ఒకటి. స్వంతూరికి దగ్గర్లో వుండే జిల్లా కేంద్రంలో అణాకానీ వుద్యోగం చెయ్యడమంత బుద్ధి తక్కువ ఏదీ లేదు. పార్టీలవాళ్ళూ, రోగాలవాళ్ళూ, ఆఫీసుల్లో పనులవాళ్ళూ, కాలేజీల్లో సీట్లవాళ్ళూ అందరూ మీద పడతారు. అర్ధరాత్రికూడా తలుపు తడతారు—పెండ్లాం పక్కలో వున్నా తలుపుతడతారు. దస్తాక్, దస్తాక్. కొందరికి కాఫీలు పొయ్యాల. కొందరికైనా భోజనం పెట్టాల.

## నవ్వు

ఆమె నవ్విన నవ్వు
అందమొల్కెడి పువ్వు
ఆమె చక్కని నవ్వు
వలపుతూపుల రువ్వు—

నాట్యకత్తియ మువ్వ
నవ్వగలదొక నవ్వు
నీలాభ్రమును జూచి
మెరుపు నవ్వను నవ్వు—

పసిపాప నవ్వులో
పాలవెల్లులు పొంగు
పాప నవ్విన నవ్వు
పాపాల దిగమ్రింగు—

నవ్వు నవ్వనివాడు
నవ్వించలేడెవని
నవ్వులేని బ్రతుకు
దవ్వు సుఖముల కవని—

—తాళ్ళపల్లి మురళీధర్

అందుకు బియ్యంకావాల. వచ్చిన వాళ్ళందరికీ పక్కలు వేయాల—తమకు పరుచుకోడానికీ, కప్పుకోడానికే లేకపోయినా. రకరకాల సేవలు. వచ్చినవాళ్ళతో ఆఫీసుల వెంట తిరిగి, ఆస్పత్రులవెంట తిరిగి, అడ్డమైన గాడిదలవెంట తిరిగి రకరకాల సేవలు. ప్రజాసేవలో ఇదీ ఒక భాగమేనేమో! అసలు వాళ్ళనని ఏం లాభం! వాళ్ళేం తినడానికే వస్తున్నారా? దగ్గరైన వాడున్నాడని వస్తున్నారు. దగ్గరవాళ్ళను, దగ్గర చాలినంత డబ్బులేని వాళ్ళను నరకయాతన పెట్టడానికి వస్తున్నారు. వాళ్ళొస్తున్నారు, తాను భరిస్తున్నాడు. కుటుంబ గౌరవం కోసం భరిస్తున్నాడు. తానేమీ వాళ్ళమీద ప్రేమ ఒలకబోసి పిలిచి పీటవెయ్యడం లేదు. సుభద్రే బంధువులు ఎదురుగా వున్నప్పుడు మర్యాదలు చూపుతూ భరిస్తోంది. అప్పులైనా, ఇంట్లోవాళ్ళకు ఇబ్బందయినా బంధు మర్యాదలు చూపాలి, అతిథి దేవోభవ! బంధు దేవోభవ! అయినా బంధుప్రలసలే రాకపోయినా ఈ జీతంరాళ్ళతో స్వర్గం చూస్తాడా? తాను మధ్యతరగతిగాళ్ళ జీవితాల్లో ఏదో రూపంలో, ఏదో వేషంలో చిక్కులు తప్పవు, చీకాకులు తప్పవు. డబ్బుల ఇబ్బందులు తప్పవు. బ్రతుకు భయాలు తప్పవు. తీగకదిపితే ముళ్ళపొద చుట్టుకుంటుంది. ముళ్ళకంప బాధిస్తుంది.

వెంకటరత్నం బజార్లోకి వచ్చాడు. బజార్లో షాపులు, గుడ్డలషాపులు, బ్రాందీ షాపులు, మందుల షాపులు. భోగంవాళ్ళలా కవ్విస్తున్న గుడ్డలషాపులు, వాళ్ళ మాపుల్లా మత్తెక్కిస్తున్న బ్రాందీ షాపులు, వాళ్ళ రోగాల్లా భయపెడుతున్న మందులషాపులు. కొట్లు కిరాణాకొట్లు. కల్తీ బ్రతుకుల్లా కిరాణాకొట్లు. బజార్లో జనం గుంపులు గుంపులు. మొగవాళ్ళూ, ఆడవాళ్ళూ. వయసులో వున్నవాళ్ళూ, లేనివాళ్ళూ. డబ్బు ముఖాలు, డబ్బులేని జబ్బుమొగాలు. ఆవిడెంత అందంగా వుంది? ఆవిడ పక్కావిడ నెక్లెసు ఎంత గొప్పగావుంది? డబ్బుంటే అన్నీ గొప్పగా వుంటాయి. ఆ స్టూడెంటు ఎంత స్టైయిలుగా వున్నాడు? ఉండకేం పెద్దవాళ్ళు చచ్చీ చెడీ డబ్బుపంపితే. ఈ స్టైయిలెంత కాలంలే. మూడ్రోజులు. ఆ డిగ్రీ తీసుకొని బజార్లో పడనీ! పులిబోను జీతంలో పడనీ! ఒక్క నెల బియ్యం

ఖర్చుకు తట్టుకోని తెలుస్తుంది. ఆ ముసలోడి ముఖంలో దరిద్రదేవత. రిటయిర్డు ఎలిమెంటరీ స్కూలయ్యవారై వుంటాడు. డెబ్బయేండ్లు నిండినా, రిటయిరైనాక పుట్టిన పిల్లలకోసమో, పెళ్లి కావాల్సిన కూతుర్లకోసమో ట్యూషన్లు చెబుతుంటాడు. తాను అట్లాగే అవుతాడు. వెంకటరత్నం భయంతో కంపించిపోయాడు. బజారంతా గంగమ్మ జాతరలావుంది. షాపులూ, కొట్లూ గంగమ్మ అలంకారాల్లాగున్నాయి. మనుషులంతా గంగమ్మకు బలిఅయ్యే దున్నపోతుల్లాగున్నారు, మేకపోతుల్లా, పొట్టేళ్లలా, గొర్రెల్లా వున్నారు. కోడిపుంజులూ, కోడిపెట్టల్లా వున్నారు. వాటిల్లో కొన్ని దేవరివి. బలిసినవి. కొన్ని బక్కవీ బడుగువీ. మరికొన్ని దొంగిచ్చివి. రకరకాలవి. జాతర బజారొక జాతర

వెంకటరత్నం తనకు ఖాతావుండే కిరాణా కొట్టు దగ్గరకు చేరుకున్నాడు. రద్దీగా వుంది గల్లా పెట్టెల్లో డబ్బులమోత. బయటి ఖాతాల పుస్తకంలో బరబర గీతల రాత. బ్రహ్మరాత. అంగడికి వచ్చిన మనుషుల ఖరీదును బట్టి దుకాణాదారుడు లక్ష్మిశెట్టి మర్యాదను పంచుతున్నాడు. రద్దీ తగ్గింది. వెంకటరత్నానికి అదును దొరికింది. బియ్యం అప్పు ఇస్తాడో లేదో అనుమానం పీకుతూనేవుంది. ధైర్యంచేసి 'లక్ష్మిశెట్టీ బియ్యం కావాల' అన్నాడు. లక్ష్మిశెట్టికి వెంకటరత్నం మాటలు విన్పించాయికాని విననట్లు పొట్లాలు కడుతున్నాడు. వెంకటరత్నం ముద్దాయిలా సంజాయిషీ చెప్పాడు.

'పోయినెల్లో బాకీ పూర్తిగా ఇవ్వలా. పిల్లోని ఇబ్బందులు వచ్చివన్నాయి. ఏమీ అనుకోవద్దు! ఈనెల తప్పకుండా తీరుస్తా.'

లక్ష్మిశెట్టికి మాట వచ్చింది :

'మాడు వెంకటరత్నం! బాకీ లిట్లా నిలిచిపోతే నా గతేంగాను. కార్పొరేషన్ల నుంచీ ఎంతెంత డబ్బు వడ్డీలకుతెచ్చి ఈ అంగడిమీద పెట్టినానో నీకేం తెలుసు? నీకేం మారాజువు. నెలాకరు జీతం గ్యారంటీవుంది. ఏది బొందు బోయినా జీతం బొందుపోదుగదా! మాదేం సంపాదన? మాకెన్ని కష్టాలు. ఈ గవర్నమెంటు అవకతవకల్లో రేట్లు నిలకడ వుండదు. దానికితోడు మా మానాన మమ్మల్ని బతకనివ్వరు. మాదేం బ్రతుకు? మా కెంతమంది మొగుళ్లు? మేమెందర్ని మేపాల! ఎంత పోటీకి నిలబడాల— బహార్లో! ఇంతావేస్తే చవుకడిపోల్లూ, కో ఆపరేటివు స్టోర్లూ మా ప్రాణానికి, ఈ గవర్నమెంటు పాలసీలకు తలాతోకా వుండదు—' లక్ష్మిశెట్టి వ్యాపార రాజకీయాలు మొదలు పెట్టాడు. ఈ అంగడీ, అంగడి వెనకేసిన డబ్బూ ఆ డబ్బుపెట్టిన పిల్లలూ తన కిచ్చి తన వుద్యోగం లక్ష్మిశెట్టి తీసుకోమను అంత జెప్పుతున్నాడు తెలుస్తుంది— ఏం మనుషులో ఏడుస్తూ రవికముళ్లు విప్పుతారు— అనుకున్నాడు వెంకటరత్నం. లక్ష్మిశెట్టి లాంటివాళ్లు ఎంత కష్టపడుతున్నదీ, ఎంత నష్టపడుతున్నదీ అర్థం చేసుకోలేనంతటి అమాయకుడు కాదు వెంకటరత్నం. కానీ వెంకటరత్నానికి అర్థంకానిదల్లా పడుగుపేకల్లా అల్లుకపోయిన న్యాయాన్యాయాల మాయ. జీవాత్మ పరమాత్మల సంయోగంలా నీతి అవినీతుల అద్వైతం. అయితే లక్ష్మిశెట్టి వంటి వాళ్లతో వాదనకు దిగే శక్తిని వెంకటరత్నం ఏనాడో త్యాగం చేశాడు. ఏదో రకంగా చేయికిందైన వానికెప్పుడూ స్వంత అభిప్రాయాలుండవు.

'మీ బాధలూ, ఇబ్బందులూ నాకు తెలియవా? కానీ పిల్లోకపోయింది. వచ్చే నెల తప్పక తీరుస్తాను' — వెంకటరత్నం అభ్యర్థించాడు.

'సర్లే దాందేముంది. మనుషులు ముఖ్యం కానీ ఈ డబ్బు శాశ్వతమా? చూడు వెంకటరత్నం నువ్వేమీ అనుకోకపోతే, వచ్చే నెల ఇవ్వలేక పోతే వడ్డీ—రూపాయొడ్డీ మాత్రం వేసుకోవాల్సి ఉంటుంది' — లక్ష్మిశెట్టి వ్యాపారదక్షత అనే పాలెగాటిని విసిరించాడు. వెంకటరత్నానికి, వాళ్ల పల్లెల్లో జాయింటుదే అయినా, మెట్టే అయినా భూమనేది వుందని లక్ష్మిశెట్టికి తెలుసు. తన డబ్బెక్కడికీ పోదనీ తెలుసు. వెంకటరత్నం బలహీనతా తెలుసు.

'సర్లే ఎప్పుడన్నా కాదన్నానా?' వెంకటరత్నం మూలిగాడు.


'మాడు వెంకటరత్నం బియ్యం రేటు కొంత పెరిగింది. కొత్త సరుకు. పాత బియ్యమే, ఏ ఒన్—మెరిసిపోతున్నాయి— కిలో రూపాయనలభై పైసలు పడ్తుంది. స్టోర్లలో ఇస్తారే, ఆ నాసిరకం చవుక బియ్యం మనుషులు తింటారా? కిలో రూపాయి బియ్యం తింటే డాక్టర్లకోసం పరుగెత్తాల. ఒక అర్ధరూపాయి పోయినా మంచిసరుకు తీసుకోవాల. ఏమంటావన్నా?' లక్ష్మిశెట్టి ఏ ఒన్ మాటలకు వెంకటరత్నం ఏమీ అనలేదు.

'ఒరే గప్పార్. వెంకటరత్నానికి ఆ ఏఒన్ సొంపులు సటా చూస్తాడు.' లక్ష్మిశెట్టి కేకవేశాడు.

'ఎందుకు. నమ్మకం లేకపోతే కదా' వెంకటరత్నం సంస్కారం మూలిగింది.

'అదీ వ్యాపారంలో నమ్మకం ముఖ్యం. ఎప్పి కావాల. ఒక మూట తీసుకపో. డెబ్బయి కిలోలేకదా. నీకని తొంబై నేను వేసుకుంటా. సంచితో తొంభై ఎనిమిది. సంచక్కర్లేకపోతే మళ్లా తెచ్చివ్వు ఇప్పుడు ఇట్లాంటి సరుకు రాదు. మూట తీసుకపో' లక్ష్మిశెట్టి ఆదరించాడు.

ఒక మూట బియ్యం అప్పు దొరుకుతోంది. ఫరవాలేదు. అప్పిచ్చే వాడుంటే వచ్చినోడుకూడా లేచొస్తాడు. — వెంకట



రత్నం మనసులో గండం గడిచిన తృప్తి, వచ్చేనెల బడ్జెట్టూ, తీర్చాల్సిన అప్పులూ, వాటిని సర్దడానికి దొరకగల అప్పులూ గజిబిజిగా వున్నాయి.

'గప్పార్ రిక్షాను పిలిచి ఆ మూటను ఎక్కించు' లక్ష్మీశెట్టి ఆదేశించాడు. రేపో మాపో సరుకులుకూడా కొన్ని తీసుకోడానికి లక్ష్మీశెట్టిని ఒప్పించుకొని బియ్యమూ, తిలకమూ తీసుకొని వెంకటరత్నం ఇల్లు చేరాడు. సుభద్ర అంది:

'బియ్యం మంచివేనా? పోయిన్నెల్లో తెచ్చిన బియ్యం మూటలో సగం రాళ్ళూ, సగం నూకలూ. చేసుకోలేక చచ్చినా. సరుకులు ఆ అంగట్లో తేవద్దంటే మానరు'

వెంకటరత్నం పలకలేదు. ఆ అంగట్లో సరుకులు తేవడం మానుకొంటే వున్నట్టుండి ఎదురయ్యే ఇట్లాంటి ఇబ్బందులు ఎవడుతీరుస్తాడు అనుకున్నాడు వెంకటరత్నం.

సుభద్ర మూట కట్టు విప్పి బియ్యం తీసుకొని, అరచేతిలో వేసు(కొ)ని, ఒకటి రెండు నోట్లో వేసుకొని అడిగింది:

'పాత బియ్యమే కిలో ఎంత?'

'రూపాయి నలభై పైసలు'

భర్త అమాయకత్వానికి, అప్రయోజ

# చెదరిన గుండెలు

కత్వానికి మరొక్క ఉదాహరణ సుభద్రకు లభించింది. బియ్యం మరి గుప్పెడు తీసుకొని పరిశీలనగా చూస్తూ అంది:

'అయ్యో రాత. దేశమంతా కిలో రూపాయయితే రూపాయి నలభై పైసలు పెట్టి తేవడమా? ఎంత అప్పయితే మాత్రం. ఇవేం ఢిల్లీ బోగాలా? ఇవి డిపో బియ్యం లాగే వున్నాయి. కాకపోతే ఒకటి రెండు శేర్లు వేరే బియ్యం కలిపినట్టుంది. నిన్న పక్కింటి పనిమనిషి డిపో బియ్యాన్ని తెచ్చి చూపింది. వాళ్ళింట్లో పిల్లా జెల్లా పోయి పది కిలోలు తెచ్చుకున్నారట. కిలో రూపాయిరవై పైసలకిస్తారట. ఆ యిరవై పైసలూ కూలి గిట్టుబాటవుతుంద(ని) రూ అంది. డబ్బుల్లేక కొన్లేదు. నా దగ్గర నెంబరు ఒక్క పది రూపాయలైనా నంచుకోమని ఇచ్చేగా. అప్పటికీ అడ్డమైనవీ నోరు మెదవకుండా తెస్తారు.'

ఏ భార్యా తన భర్త ప్రయోజకుడను కోదు — అనుకున్నాడు వెంకటరత్నం. లక్ష్మీశెట్టి మోసం వెంకటరత్నాన్ని బాధించింది. లక్ష్మీశెట్టి మీద విపరీతమైన కోపం వచ్చింది. కర్మ వెధవ! ఏ కూలీలనుంచో, రిక్షావాళ్ళ పెళ్ళాలనుంచో, డిపో మేనేజరు నుంచో చౌక బియ్యాన్ని సంపాయించి కల్తీ చేసి రూపాయి బియ్యాన్ని రూపాయినలభై పైసలకు తగిలగట్టాడు. వ్యాపారస్తుడు నమ్మినవాన్ని కాక నమ్మనివాన్ని మోసం చేస్తాడా? నమ్మక మార్గాంతరం ఏముందీ? అంగళ్ళలో తనవంటివాడికి ఖాతాలు తప్పవు. ఖాతాల్నుంచి విముక్తి కావడం అసాధ్యం. అందుకే ఈ మోసాలు తప్పవు. తాను పై మెట్టువాడు కాదు — పచ్చనోట్లూ నల్ల నోట్లూ విసిరి తన కిష్టం వచ్చినప్పుడు, ఇష్టమైన వస్తువులు, ఇష్టమైనచోట కొనడానికి. తాను కింది మెట్టువాడు కాదు, దిన కూలీతో చాలా వస్తువులు కొనను అవసరం లేకపోవడానికి. తనది నెల కూలి. ఏదో అంకుస్తుందనుకునే నెల కూలి. నిప్పు ఉప్పుల్లో బిగించే నెలకూలి. నడి మెట్టు నెలకూలి. వెంకటరత్నం మనసు పాడైపోయింది.

సమాధానం చెప్పకుండా ఆలోచనల్లోకి జారుకొనే భర్తను చూసి సుభద్ర విసుక్కుంది:

'ఏదన్నా అడిగితే సమాధానం చెప్పరేవా! ఈ బియ్యాన్ని వాడి మొగాన్న తగలెయ్య. వాడి దగ్గర మొగమాట మేమిటి? ఆ డిపో బియ్యమే కొనుక్కుందాం. ఇన్నేళ్ళు సంసారంచేసి ఆ మాత్రం తెలియకపోతేఎట్లా?'

వెంకటరత్నంలో ఏదో కదిలింది.

'చూడు సుభద్రా — నన్ను మాటిమాటికీ విసిగించవద్దు. నా మీద ఇట్లా విరుచుకుపడవద్దు. సంసారంకోసం నేను పడే బాధలు పడుతున్నా, మోసమూ పడుతున్నా. ఇదంతా నా చేతగానితనమే అనుకో. మునిగిపోయిందేమీ లేదు. దేశంలో నాలాంటివాళ్ళు సవాలక్షమందున్నారు. నాలాంటివాళ్ళు కాదు — మనలాంటి వాళ్ళందర్నీ విశ్వామిత్రుడు సృష్టించినట్టుంది. వాడొక భ్రష్టయోగి. వీడు మనమొక భ్రష్టవర్గం. త్రిశంకుడి వారసులం. మన బాధ లిప్పటికింతే. ఇట్లా కుళ్ళుకుంటూ చావాల్సిందే. నువ్వు గొంతు చించుకొని ప్రయోజనం లేదు. నను మాటి మాటికీ ఏడ్చి లాభం లేదు. ఈ బాధల్నుంచి బయటపడే ఒక మంచి మార్గమే తెలిస్తే నువ్విట్లా నన్ను హింసించవు. నే నిట్లా కంబడి పురుగులా బతకను.'

సుభద్ర నోరెత్తలేదు.

---

**కాయధాన్యములు - గుణాలు:**

## చోళ్ళు

మన ప్రాంతంలో చోడిపిండితో తయారు చేసే అంబలిని చాలామంది తింటూంటారు. కొందరు జావకాచి కూడా త్రాగుతూంటారు. చోడిపిండితో రొట్టెలు చేసి కూడా తింటూంటారు.

చోడిపిండి అంబలి బలవు చేస్తుంది. పైత్యాన్ని అణచి వేస్తుంది. ఆకలి దప్పికలను అణుస్తుంది. రక్తపైత్యాన్ని పోగొడుతుంది. మేహశాంతి చేకూరుస్తుంది. వెంట్రుకలకు బలాన్ని యిస్తుంది. పైత్యశూలలను పోగొడుతుంది.

అధికంగా తింటే మూత్రాన్ని లఘువం చేస్తుంది. కఫాన్ని పెంపొందిస్తుంది. త్రిప్పును పుట్టిస్తుంది. శరీరాన్ని శుష్కింపజేస్తుంది.

దీనియొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. ఓమము, 2. బెల్లం, 3. సోపు, 4. లవంగాలు.

## జొన్నలు

కొన్ని ప్రాంతాలలో కొంతమంది జొన్న అన్నం, జొన్న అంబలి, జొన్న జావ ప్రధాన ఆహారంగా వాడుతూండడం కద్దు.

జొన్న అన్నం కఫాన్ని, పైత్యాన్ని హరిస్తుంది. వీర్యవృద్ధిని బలాన్ని యిస్తుంది.

మలమూత్రాలను అధికపరుస్తుంది. సులభంగా జీర్ణం కాదు. నేత్రరోగాన్ని తెస్తుంది. వాతపైత్యాన్ని చేస్తుంది. గుల్మం, మూల వ్యాధి గలవారికిది అపథ్యమయినది.

దీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. పాలు, 2. నెయ్యి, 3. మిఠాయి, 4. ఓమము.

మనదేశంలో కొన్ని ప్రాంతాలలో మొక్కజొన్న పొత్తుల్ని విశేషంగా పండిస్తున్నారు. మొక్కజొన్న పొత్తులు వేడి చేసి అర్పుతాయి. శరీరానికి మంచి శక్తిని యిస్తాయి. దేహపుష్టిని చేకూరుస్తాయి. కాని యివి సులభంగా జీర్ణం కావు. వాతం చేస్తాయి.

వీని యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. ఓమము, 2. జవారిషు, 3. సికింజబీను.

**సేకరణ: ఆకుండి నారాయణమూర్తి**